క్లుప్తంగా

రైతులకు టార్పాలిన్ల పంపిణీ



కపిలేశ్వరపురంలోని రైతుకు టార్పాలిన్ అందజేస్తున్న నాయకులు

కపిలేశ్వరపురం: గ్రామంలోని రైతులకు ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) ఆధ్వర్యంలో సమకూర్చిన తార్పాలిన్లును ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ రైతు కోసం తానా పేరుతో అన్నదాతకు టార్పాలిన్లు, పవర్ స్ప్రేయర్స్ అందిస్తున్నట్టు తెలిపారు. కపిలేశ్వరపురం గ్రామానికి చెందిన కోరపాటి సత్యనారాయణ ఆధ్వర్యంలో రైతులకు వీటిని అందజేశారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధులు, రైతు నాయకులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతలకు సత్కారం



రాజబాబు, దొరబాబులను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

కపిలేశ్వరపురం (మండపేట): ఇటీవల బౌద్ధధర్మ అవార్డు అందుకున్న న్యూ డ్రాగన్ చైనీస్ కుంగ్ ఫూ గ్రాండ్ మాస్టర్ పిట్టా రాజబాబు, మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన మాజీ కౌన్సిలర్ మందపల్లి చంద్రశేఖర్ (దొరబాబు)లను ఆదివారం ఘనంగా సత్కరించారు. తమ స్నేహితులు, 1990–91 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు పూలమాల, శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో గండి స్వామి ప్రసాద్, తెగడ సత్తిబాబు, పెందుర్తి ప్రదీప్ కుమార్, కుంగ్ ఫూ విద్యార్థులు పాల్గొన్నారు.

కిశోర్‌కు మాతృ వియోగం



శాంతకుమారి (ఫైల్)

కపిలేశ్వరపురం: వైఎస్సార్ సీపీ మండపేట నియోజకవర్గ సేవాదళ్ కన్వీనర్, పడమర ఖండ్రికకు చెందిన పాలింగి కృష్ణకిశోర్ మాతృమూర్తి శాంతకుమారి (52) శనివారం రాత్రి మృతి చెందారు. గత కొంతకాలంలో అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె తుదిశ్వాస విడిచారు. ఆమె 2013–18 మధ్య పడమర ఖండ్రిక పీఏసీఎస్ డైరెక్టర్‌గా సేవలందించారు. పార్టీ మండల కన్వీనర్ గూటం సత్యనారాయణ, నియోజకవర్గం ప్రచార కమిటీ కన్వీనర్ వంగా నల్ల శ్రీను, ఉపాధ్యక్షుడు సలాది వీరబాబు సంతాపం వ్యక్తం చేశారు.

విజయదుర్గా పీఠంలో పౌర్ణమి పూజలు



వెదురుపాక విజయదుర్గా పీఠంలో సామూహిక కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు

రాయవరం: మండలంలోని వెదురుపాక విజయదుర్గా పీఠంలో ఆదివారం పౌర్ణమి పూజలు ఘనంగా నిర్వహించారు. పీఠంలో వేంచేసిన విజయదుర్గాదేవిని నయనానందకరంగా అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి సామూహిక కుంకుమ పూజలు చేశారు. అనంతరం భక్తులు పీఠాధిపతి వాడ్రేవు వెంకటసుబ్రహ్మణ్యం(గాడ్) ఆశీస్సులు పొందారు. భక్తులకు విజయదుర్గా సేవా సమితి ఆధ్వర్యంలో అన్న సమారాధన నిర్వహించారు.

సిమెంట్ రోడ్ల ప్రారంభం



శిలాఫలకాన్ని ఆవిష్కరించి రోడ్డును ప్రారంభిస్తున్న మంత్రి సుభాష్

కె.గంగవరం: మండల పరిధిలో దంగేరు గ్రామంలో ఆదివారం సిమెంట్ రోడ్లను రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్ శిలాఫలకాన్ని ఆవిష్కరించి ప్రారంభించారు. గ్రామంలో సుమారు రూ.19 లక్షల ఎంజీఎన్ఆర్‌జీఎస్ నిధులతో నిర్మించిన నాలుగు సిమెంట్ రోడ్లను స్థానిక నాయకులతో కలసి ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొప్పిశెట్టి రమణ, మాజీ సర్పంచ్ రావిపాటి వెంకటగణేష్ చౌదరి పాల్గొన్నారు.

రేపు విద్యుత్ అంతరాయం

రామచంద్రపురం రూరల్: మేజర్ పంచాయతీ ద్రాక్షారామలో మరమ్మతుల నిమిత్తం కొన్ని వీధుల్లో మంగళవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏపీఈపీడీసీఎల్ ద్రాక్షారామ ఏఈ మేడిశెట్టి వెంకటరమణ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ద్రాక్షారామలోని గాంధీ బొమ్మ సెంటర్, పాత ఆంధ్రా బ్యాంకు వీధి, మాగాపు వారి వీధి, సాక్షి వారి వీధి, ముస్లిం కాలనీ, నున్న వారి వీధి, ఆగా వారి వీధుల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని తెలిపారు.

మట్టి నమూనాలు.. వట్టి ఫలితాలు

- మూడు నెలలు దాటినా అందని భూసార కార్డులు
- భూసార పరీక్షల ఫలితాల కోసం ఎదురుచూస్తున్న రైతులు
- పట్టించుకోని అధికారులు



మట్టి నమూనాలు సేకరిస్తున్న వ్యవసాయ సిబ్బంది (ఫైల్)



రాయవరం మండలంలో చిరుపొట్ట దశకు చేరుకున్న వరి పంట

రాయవరం: అన్నదాతలు ఖరీఫ్ సాగులో నిమగ్నమయ్యారు. వరినాట్లు వేశారు. వరి పంట ఇప్పుడు చిరుపొట్ట దశకు చేరుకుంది. మట్టి నమూనాలు సేకరించి దాదాపుగా నాలుగు నెలలు కావస్తున్నప్పటికీ నేటికీ భూసార పరీక్షల ఫలితాల కార్డులు రైతుల దరి చేరలేదు. భూమిలో సరైన పోషకాలు ఉన్నాయా ? నత్రజని, ఫాస్ఫరస్, పొటాషియం మట్టిలో ఏ మేరకు ఉన్నాయి.. ఎంత మోతాదులో ఎరువులు వాడాలి తదితర వివరాలు తెలుసుకోవాలంటే భూసార కార్డులు ఎంతో అవసరం. భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువులు వాడితే భూమి సారవంతంగా ఉండడంతో పాటు అన్నదాతలు వ్యయ భారాన్ని తగ్గించుకుని అధిక దిగుబడులు సాధించవచ్చు. ఫలితాలు తెలుసుకోకుండా ఇష్టానుసారంగా ఎరువులు వాడడంతో పంట దెబ్బతిని రైతులు ఆర్థికంగా నష్టపోతారు. రైతుల నుంచి మట్టి నమూనాలు సేకరించి ఇప్పటికి నాలుగు నెలలు కావస్తున్నా ఫలితాలు రాకపోవడంతో ఖరీఫ్ పంటలపై రైతుల్లో ఆందోళన నెలకొంది.

6,748 నమూనాల సేకరణ

రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల పరిధిలో 1.01 లక్షల ఎకరాల్లో రైతులు ఖరీఫ్ వరిసాగు చేస్తున్నారు. రామచంద్రపురం, మండపేట, కె.గంగవరం, కాజులూరు, రాయవరం, కపిలేశ్వరపురం, కె.గంగవరం మండలాల పరిధిలోని 120 గ్రామాల్లో జూన్ నుంచి ఖరీఫ్ సీజన్ ప్రారంభం కాగా, జూలై నెలాఖరుకు దాదాపుగా వరినాట్లు పూర్తయ్యాయి. వరినాట్లు ప్రారంభించే లోపు మట్టి నమూనాలు సేకరించి ఫలితాలను అందించాల్సి ఉంది. ఏప్రిల్ 15 నుంచి మే 15 వరకు పొలాల్లో వ్యవసాయాధికారులు మట్టిని సేకరించారు. ప్రతి 2.5 ఎకరాల భూమికి ఒక నమూనా తీశారు. క్లస్టర్ పరిధిలో 6,748 నమూనాలను సేకరించి, జిల్లాలోని భూసార కేంద్రానికి పంపించారు. నేటి వరకు ఫలితాల కార్డులు రాక పోవడంతో ఖరీఫ్ పంటలపై రైతుల్లో ఆందోళన నెలకొంది.

భూస్వభావం ముందే తెలిస్తే మేలు

ఖరీఫ్ వరి నాట్లు పూర్తయ్యి దాదాపు రెండు నెలలు కావస్తోంది. వరి పంట మూన తిరిగి దుబ్బు కట్టి చిరుపొట్ట దశకు చేరుకుంది. ఈ పరిస్థితుల్లో భూస్వభావంపై రైతులకు అవగాహన ఉంటే వారికి మేలు జరుగుతుంది. దీంతో మంచి దిగుబడులు సాధించవచ్చు. పంట వేసిన తరువాత అధికారులు ఫలితాల కార్డులను అందిస్తే ఎటువంటి ఉపయోగం ఉండదు.

మట్టి నమూనా పరీక్షలతో మేలు



భూసారాన్ని తెలుసుకోవడం కోసం మట్టి నమూనాలను ఏటా సేకరించి పరీక్షలకు పంపిస్తాం. దీని భూమిలోని పోషక విలువలు ఏ మేర ఉన్నాయో స్పష్టంగా తెలుస్తోంది. ప్రతి 2.5 ఎకరాలకు ఒక నమూనాను సేకరిస్తాం. భూసార పరీక్షల ఫలితాలు రావాల్సి ఉంది.

– కొప్పిశెట్టి ప్రభాకర్, మండల వ్యవసాయాధికారి, మండపేట

త్వరలోనే అందజేస్తాం



రైతుల పొలాల్లో మట్టి నమూనాలు సేకరించి జిల్లా భూసార పరీక్షల కేంద్రానికి పంపించాం. త్వరలో ఫలితాలు రానున్నాయి. భూసార కార్డులు వచ్చిన వెంటనే రైతులకు అందజేస్తాం.

– కేవీఎస్ రమేష్‌కుమార్, మండల వ్యవసాయాధికారి, రాయవరం

నిబద్ధత గల నేత పాపారాయుడు



మండపేటలో కర్రి పాపారాయుడిని అభినందిస్తున్న నాయకులు

కపిలేశ్వరపురం: వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాటలో నడుస్తున్న కర్రి పాపారాయుడు నిబద్ధత గల నాయకుడు అని పలువురు పేర్కొన్నారు. పాపారాయుడు వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి బాధ్యతతో పాటు అమలాపురం, రాజోలు అసెంబ్లీ నియోజకవర్గాల పార్టీ పరిశీలకులుగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా మండపేట విజయలక్ష్మి నగర్‌లోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గంలోని నాయకులు పాపారాయుడిని సత్కరించారు. పాపారాయుడు మాట్లాడుతూ తనకు పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వహిస్తానన్నారు. 2019–24 మధ్య సంక్షేమ పాలనను పునరావృతం చేసేందుకు అందరూ సమన్వయంతో కృషి చేద్దామని పిలుపునిచ్చారు. జెడ్పీటీసీ సభ్యురాలు కురుపూడి భవాని, వైస్ ఎంపీపీ పసుమర్తి నాగేశ్వరరావు, పార్టీ మండల కమిటీ కన్వీనర్ అడబాల బాబ్జి, రాష్ట్ర యువజన విభాగం సహాయ కార్యదర్శి వాసిరెడ్డి అర్జున్, నాయకులు కురుపూడి రాంబాబు, మట్టపర్తి గోవిందరాజు, పలివెల సుధాకర్, వల్లూరి రామకృష్ణ, పెంకే గంగాధరం మీగడ శ్రీనివాస్ పలివెల సుధాకర్, వనుం నారాయణ, వాసంశెట్టి శ్రీనివాస్, పమిడిపల్లి నానాజీ పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతకు సన్మానం



ఏడిదలో వెంకటేశ్వరరావును సత్కరిస్తున్న పద్మశాలీ సంఘం నాయకులు

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట మండలం ఏడిద గ్రామానికి చెందిన ఉడతా వెంకటేశ్వరరావు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. దీంతో ఏడిదలో ఆదివారం పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఆలమూరు మండలం చింతలూరు గ్రామ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న వెంకటేశ్వరరావును పూలమాల, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు ఇమంది నాగరాజు, ఆలిండియా వీవర్స్ ఫెడరేషన్ రాష్ట్ర చీఫ్ సెక్రటరీ బేతావెంకటేశ్వరరావు, జిల్లా పద్మశాలి సంఘం యువజన అధ్యక్షులు పదం ఆనందరావు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం (మండపేట): మండపేటలో జమాఅతె ఇస్లామీ మహిళా విభాగం అధ్యక్షురాలు ఆయేషా జమీలా ఆధ్వర్యంలో మౌలానా జలాలుద్దీన్ ఉమ్రి ఆడిటోరియం హాల్‌లో ఆదివారం పలువురు మహిళా ఉపాధ్యాయులను సత్కరించారు. ఈ సందర్భంగా అయేషా మాట్లాడుతూ సమాజంలో ఉపాధ్యాయుల సేవలు ఎంతో స్ఫూర్తిదాయకమని అన్నారు.

రైతుకు బాసటగా వైఎస్సార్ సీపీ

- పార్టీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి, పరిశీలకురాలు జక్కంపూడి విజయలక్ష్మి
- అన్నదాత పోరు పోస్టర్ ఆవిష్కరణ



మండపేటలో అన్నదాత పోరు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జగ్గిరెడ్డి, విజయలక్ష్మి తదితరులు

కపిలేశ్వరపురం (మండపేట): కూటమి పాలనలో కష్టాలు పాలవుతున్న అన్నదాతకు అండగా వైఎస్సార్ సీపీ నిలుస్తోందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి, పరిశీలకురాలు జక్కంపూడి విజయలక్ష్మి అన్నారు. మండపేటలోని పార్టీ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు, యువనేత తోట పృథ్వీరాజ్, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాధాకృష్ణ, సీనియర్ నాయకులు వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి, అడబాల బాబ్జిలతో కలిసి ఈ నెల 9న నిర్వహించే అన్నదాత పోరు కార్యక్రమం పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జగ్గిరెడ్డి, విజయలక్ష్మి మాట్లాడుతూ ఎరువుల బ్లాక్ మార్కెట్‌పై అన్నదాత పోరు పేరుతో నిర్వహించే ఆందోళనను విజయవంతం చేయాలని కోరారు. రైతన్నకు బాసటగా నిలిచే లక్ష్యంతో వైఎస్సార్ సీపీ ముందుకు సాగుతుందన్నారు. బ్లాక్ మార్కెట్‌ను నియంత్రించాలని, అవసరమైన ఎరువులను వెంటనే పంపిణీ చేయాలని, పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, ఉచిత పంటల బీమాను పునరుద్ధరించాలని, వర్షాల కారణంగా పంటలు దెబ్బతిన్న రైతులకు వెంటనే ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలని తదితర డిమాండ్లతో పోరుబాట నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పసుమర్తి నాగేశ్వరరావు, కరుపూడి రాంబాబు, దూలం వెంకన్నబాబు, వాసిరెడ్డి అర్జున్, పలివెల సుధాకర్, పోతుల దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

చంద్ర గ్రహణం.. ఆలయాల మూసివేత



ద్రాక్షారామ మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి ఆలయం తలుపులను మూసివేస్తున్న అర్చకుడు

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన ద్రాక్షారామ మాణిక్యాంబ సమేత భీమేశ్వర స్వామి ఆలయాన్ని ఆదివారం సంపూర్ణ చంద్ర గ్రహణం కారణంగా మధ్యాహ్నం 12 గంటలకు స్వామివారికి నివేదన అనంతరం మూసివేశారు. ఆలయాన్ని సోమవారం ఉదయం పుణ్యాహవచనాది కార్యక్రమాల అనంతరం 7.30 గంటలకు తెరిచి సర్వదర్శనాలకు అనుమతించనున్నట్లు ఆలయ ఈఓ, దేవదాయ శాఖ సహాయ కమిషనర్ అల్లు వెంకటదుర్గాభవాని తెలిపారు.

ఆలయాల మూసివేత

కాజులూరు: సంపూర్ణ చంద్రగ్రహణం పురస్కరించుకుని కాజులూరు మండలంలోని పలు ప్రధాన ఆలయాలను ఆదివారం మూసివేశారు. ఈ సందర్భంగా గొల్లపాలెం శ్రీ బాలాత్రిపుర సుందరి సమేత గోకర్ణేశ్వరస్వామి ఆలయ అర్చకులు పూజ్యం మణికంఠ స్వామి మాట్లాడుతూ రాహుగ్రస్త సంపూర్ణ చంద్ర గ్రహణం ఏర్పడుతున్న కారణంగా ఉన్నతాధికారుల సూచన మేరకు దేవాలయాన్ని మూసివేస్తున్నట్లు తెలిపారు. ఆదివారం రాత్రి 9:50 గంటల నుంచి రాత్రి 12:24 గంటల వరకు సంపూర్ణ చంద్రగ్రహణం ఉంటుందన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు నివేదన పూర్తి చేసిన తరువాత ఆలయాన్ని మూసివేసినట్టు తెలిపారు. సోమవారం ఉదయం పుణ్యాహ వచనాది కార్యక్రమాలు పూర్తి చేసి సర్వదర్శనాలకు అనుమతిస్తామని పేర్కొన్నారు. మండలంలో ద్రాక్షారామ భీమ మండలానికి అష్టసోమేశ్వరాలయాల్లో తూర్పున ఉన్న కోలంక సోమేశ్వరాలయం, ఈశాన్య దిక్కున ఉన్న పెనుమళ్ల శివాలయం, శీలలోని రామలింగేశ్వరాలయం, కాజులూరులో తూర్పుకాశీగా పిలవబడుతున్న అన్నపూర్ణసమేత కాశీవిశ్వేశ్వరాలయం తదితర ఆలయాలు సంపూర్ణ చంద్రగ్రహణాన్ని పురస్కరించుకుని మూసివేశారు.

పదవులను బాధ్యతగా స్వీకరించాలి

కాజులూరు: పదవులను అలంకారప్రాయంగా కాకుండా ఒక బాధ్యతగా స్వీకరించాలని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. కోలంక సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) త్రిసభ్య కమిటీ ప్రమాణస్వీకార కార్యక్రమంలో మంత్రి సుభాష్, మాజీ సహకారశాఖ మంత్రి చిక్కాల రామచంద్రరావు, జనసేన నియోజకవర్గ కన్వీనర్ పోలిశెట్టి చంద్రశేఖర్ తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. నూతన చైర్మపర్సన్‌గా నియమితులైన బోండా వెంకటనరసింహనాయుడు, పీఏసీఎస్ పర్సన్లుగా నియమితులైన గుబ్బల కృష్ణమూర్తి, మేడిశెట్టి వెంకటేశ్వర్లుతో ప్రమాణస్వీకారం చేయించి, వారికి నియామకపత్రాలు అందజేసారు.

నిత్యాన్నదానానికి విరాళం

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి రాజోలుకు చెందిన గంటి సూర్యనారాయణమూర్తి ఆదివారం రూ.25 వేలు విరాళం అందజేశారు. ఈ డబ్బును ఆలయ ప్రధానార్చకులు మాచరి వినాయకరావుకు అందజేశారు. దాతను అర్చకులు వేదమంత్రాలతో సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

వైఎస్సార్ సీపీ పిలుపుతో కూటమిలో కలవరం



కొత్తూరులో రైతుల నుంచి సంతకాలు సేకరించిన లేఖ



కొత్తూరులో మాట్లాడుతున్న తహసీల్దార్ మృత్యుంజయరావు

రామచంద్రపురం రూరల్: రాష్ట్రంలో యూరియా కొరతపై వైఎస్సార్ సీపీ శ్రేణులు ముందుండి రైతుల పక్షాన పోరాడాలని మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపునిచ్చిన నేపథ్యంలో కూటమి నాయకుల్లో కలవరం మొదలైంది. రామచంద్రపురం నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్, పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు పిల్లి సూర్యప్రకాశ్ ఇప్పటికే రైతులు, పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకుంటూ ఉద్యమం దిశగా ముందుకు వెళుతున్నారు. దీనితో నియోజకవర్గంలోని కూటమి నాయకులు, అధికారులతో కలసి రైతులకు అవగాహన కోసమంటూ సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఆదివారం వ్యవసాయ, రెవెన్యూశాఖాధికారులు రామచంద్రపురంలోని కొత్తూరులో, రూరల్‌లోని వేగాయమ్మపేటలో సమావేశాలు నిర్వహించారు. రైతులకు లేఖలు అందించి వాటిపై సంతకాలు చేయించుకున్నారు. రానున్న 3, 4 రోజుల్లో యూరియా సరఫరా చేయడం జరుగుతుందని ఆ లేఖ సారాంశం. మార్కెట్‌లో నానో యూరియా అందుబాటులో ఉందని రెండు, మూడవ విడతల్లో యూరియాకు బదులుగా నానో యూరియా వాడవచ్చని రైతులకు ఉచిత సలహాలు ఇస్తున్నారు. సమావేశాల్లో మార్కెట్ కమిటీ చైర్మన్ అక్కల రిష్వంత్ రాయ్, తహసీల్దార్ బి. మృత్యుంజయరావు, మండల ప్రత్యేక అధికారి టి. నాగలక్ష్మి, ఏడీఏ బి. నాగకుమార్, డీఆర్‌సీ ఏఓ మనోహర్, మండల వ్యవసాయ అధికారి టీవీఆర్ మణిదీప్ తదితరులు పాల్గొన్నారు.

సామూహిక చర్యలతోనే సత్ఫలితాలు

- పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం
- రైతులకు బ్రోమోడయోలిన్ మందు ఉచితంగా పంపిణీ
- మందు వినియోగంపై వ్యవసాయశాఖ సూచనలు



కాజులూరులో ఎలుకల మందు ఎరను తయారు చేస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది



గొల్లపాలెంలో ఎలుకల దాడికి గురైన వరి పొలం

కాజులూరు: పంటలపై ఎలుకల దాడి రోజురోజుకీ అధికమవుతోంది. రాత్రి, పగలు తేడా లేకుండా మూషికాలు పొలాల్లో విజృంభిస్తూ వరి దుబ్బులను మొదలుకు కొరికిపారేస్తున్నాయి. చీడపీడలను నివారిస్తూ ఎరువులు వేసి ఏపుగా పెంచిన వరి పంట ఎలుకల దాడికి నాశనమవుతుంటే రైతులు లబోదిబోమంటున్నారు. రామచంద్రపురం నియోజకవర్గంలో మొత్తం 52 వేల ఎకరాల్లో ఈ ఏడాది వరి సాగవుతుండగా అధిక శాతం పొలాల్లో పంట దుబ్బుకట్టే దశ నుంచి చిరుపొట్టకు చేరువలో ఉంది. ఈ దశలోనే వరి పంటపై ఎలుకల దాడి అధికంగా ఉంటోందని, వీటి నివారణకు ఎన్ని చర్యలు చేపట్టినా ఫలితం నామమాత్రంగానే ఉంటోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

10 బస్తాల వరకు దిగుబడి తగ్గుతోంది

బుట్టలు పెట్టి, బొరియల్లో పొగపెట్టి ఊదరపెట్టినా ఎలుకల ఉధృతి తగ్గటంలేదని ఈ విధానాల్లో ఎలుకల నిర్మూలనకు అధిక వ్యయం కావడమే కాకుండా ఎలుకలు దాడికి గురైన పొలంలో ఎకరానికి 10 బస్తాల వరకు దిగుబడి తగ్గుతోందని రైతులు చెబుతున్నారు. రైతులు ఎవరికి వారే తమ పొలాల్లో ఎలుకల నివారణ చర్యలు చేపట్టడం కాకుండా సామూహికంగా చర్యలు చేపడితే ఎలుకలను సమూలంగా నిర్మూలించవచ్చునని కాజులూరు మండల వ్యవసాయశాఖాధికారి వి.అశోక్ చెబుతున్నారు. సాధారణంగా రైతులు తమపొలాల్లో మందులు పెట్టి ఎలుకలను నిర్మూలించిన పక్కపొలాల్లోంచి ఎలుకలు వచ్చి తమ సంతతిని వృద్ధి చేసుకుంటూ పంటలపై దాడిచేస్తుంటాయి. ఒక ప్రాంతంలోని రైతులందరూ ఒకే మారుగా ఒక పద్ధతి ప్రకారం నివారణ చర్యలు చేపడితే మంచి ఫలితాలు ఉంటాయి. ఈ నేపథ్యంలో వ్యవసాయాధికారులు నియోజకవర్గ గ్రామాల్లో రైతుసేవాకేంద్రాల ద్వారా బ్రోమోడయోలిన్ మందు పంపిణీ చేస్తున్నారు. కాజులూరు మండలానికి 83 కేజీలు, రామచంద్రపురం మండలానికి 80 కేజీలు, కె గంగవరం మండలాలకు 82 కేజీలు చొప్పున బ్రోమోడయోలిన్ మందు విడుదలైంది. వాటిని వ్యవసాయశాఖ సిబ్బంది రైతులకు పంపిణీ చేస్తూ ఉపయోగించే విధానాలపై అవగాహన కల్పిస్తున్నారు.

మందు తయారీ.. వాడే విధానం

జీవరాశుల్లో మనిషి తరువాత తెలివైన జీవుల్లో ఎలుక ఒకటని కాజులూరు మండల వ్యవసాయాధికారి అశోక్ అన్నారు. ఎలుక మందుతిని తక్షణమే చనిపోయే పరిస్థితి వచ్చినప్పుడు ఆ సంకేతాలను ఇతర ఎలుకలకు అందిస్తుందని ఫలితంగా అవి మందు జోలికి వెళ్లవన్నారు. వ్యవసాయ శాఖ సరఫరా చేస్తున్న బ్రోమోడయాలిన్ మందు వలన ఎలుక స్లోపాయిజన్ మాదిరి రక్తనాళాలు స్తంభించి మూడు లేదా నాలుగురోజుల తరువాత చనిపోతుందన్నారు. దీనివలన మందుపెట్టిన ఒకటి, రెండు రోజుల్లో దాదాపు పొలంలోని ఎలుకలన్నీ మందు తింటాయన్నారు. హెక్టారు పొలానికి అర కిలో మందు కలిపిన ఎర అవసరమవుతుందన్నారు. ఇందుకోసం రైతులు 480 గ్రాములు నూకలు, పది గ్రాముల నూనె, పది గ్రాములు బ్రోమోడయోలిన్ మందును కలిపి మందు ఎరను తయారు చేసుకోవాలన్నారు. ముందుగా నూకలను పేపరుపై వేసి నూనె పోసి కలపాలి, ఆపై బ్రోమోడయోలిన్ మందును వేసి నూనె కలిపిన నూకలకు పట్టించాలన్నారు. ఈ మందును మూడు అంగుళాల వ్యాసం, 18 అంగుళాల పొడవు కలిగిన పీవీసీ పైపుల్లో 30 గ్రాములు చొప్పున పొట్లాలు కట్టి పొలానికి నాలుగు మూలలా గట్లపై అమర్చుకోవాలి. వారానికి రెండుసార్లు తాజాగా తయారు చేసిన ఎరను మార్చుకోవాలన్నారు. పీవీసీ పైపులు వాడటం వలన విషపు ఎర ఎండ, వానలకు పాడవకుండా ఉండటమే కాకుండా పక్షులు, పెంపుడు జంతువులకు అందకుండా మెరుగైన ఫలితాలను ఇస్తుందన్నారు.



వి.అశోక్, మండల వ్యవసాయాధికారి, కాజులూరు